# సింగిల్ పేజీ కథలు

## కర్తవ్యం

ఈ వయసులో కూడా అమ్మలో అంత చొరవ, చురుకుదనం వున్నాయని మొదటిసారిగా ఆ సంఘటన ద్వారా తెల్సింది నాకు.

నాన్న హార్ట్ ఎటాక్‌తో చనిపోవడంతో మా ఊరి నుండి అమ్మను శాశ్వతంగా నాదగ్గరే ఉండిపోవడానికి తీసుకు రావడానికి భగీరథ ప్రయత్నమే చెయ్యాల్సివచ్చింది.

"బతికినన్నాళ్ళూ ఈ పల్లెలోనే ప్రశాంతంగా నన్ను బతకనీయరా కన్నా. ఆ సిటీ రణగొణ ధ్వనులలో నాకు ఊపిరాడదురా. నేనక్కడ ఉండలేనురా" అంటూ చాన్నాళ్లు హైదరాబాద్‌కి రాకుండా గట్టిగా ప్రతిఘటించిన అమ్మ- నా గోల భరించలేక నాదగ్గరకైతే వచ్చిందిగాని "నేనడిగిన వెంటనే నన్ను మనూరికి పంపించెయ్యాలి మరి" అంటూ షరతు పెట్టి మరీ వచ్చింది హైదరాబాద్‌కి.

సిటీకి ముప్పై కిలోమీటర్ల దూరంలో ఇప్పుడిప్పుడే కొత్తగా కడ్తున్న ఒక కాలనీలో వుంది నా ఇల్లు. కాలనీలో నా ఇల్లే చివరిది. నా ఇంటికి కొద్దిదూరంలో పంటపాలాలు ఒక పక్కన, ఎదురుగా వున్న ఖాళీ స్థలంలో 'పాల ఉత్పత్తి కేంద్రం' పల్లెటూరి వాతావరణాన్ని తలపింపచెయ్యడంతో- అయిష్టంగా నాదగ్గరకు వచ్చిన అమ్మ "చాలా బాగుందిరా కన్నా ఈ కాలనీ" అంటూ సంతోషంగా నాదగ్గరే ఉండిపోయింది ఇక పల్లె ఊసెత్తకుండా.

* * *

వేసవికాలం.. మే నెల చివరివారం.. సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించడంలో ఎక్కడా రాజీపడటం లేదు. బైటకు అడుగుపెట్టాలంటే భయమేస్తుంది. అలాంటి ఎండలో.. మధ్యాహ్నం మూడు గంటలప్పుడు బైటకు వెళ్ళి ఆడుకుంటానంటూ గొడవ చేస్తున్న మావాడ్ని బలవంతంగా హాల్లో కూర్చోబెట్టి వాడితో క్యారమ్స్ ఆడసాగింది అమ్మ.

ఫస్ట్‌క్లాస్ చదువుతున్న మనీష్‌కి వాడి వయస్సు పిల్లలతో ఆడుకోవడమే వాడికిష్టం. అందుకే బైటకెళతానని వాడు మారాం చేస్తున్నాడు. ఆ మండుటెండలో వాడ్ని బైటకు పంపడానికి ఇష్టపడకపోవటంతో అలాగే కష్టపడి క్యారమ్స్ ఆడిస్తూంది. మధ్య మధ్యలో వాడి అరుపులు, అమ్మ 'ష్'లు నాకు బెడ్‌రూమ్‌లోకి వినిపిస్తున్నాయి. ముందురోజు 'రాత్రి డ్యూటీ' చెయ్యడంతో.. నిద్రకోసం దొర్లుతున్నాను బెడ్ మీద. నెమ్మదిగా నిద్రాదేవి తన ఒడిలోకి లాక్కోబోతుండగా..సరిగ్గా అప్పుడే..

ఒక్కసారిగా బైటనుండి పెద్దపెట్టున హాహాకారాలు..అరుపులు.. పెద్దగా కేకలు వేస్తూ జనం అటూ ఇటూ పరుగులుదీస్తున్న శబ్దాలు..నా చెవిన పడటంతో నిద్రమత్తు ఎగిరిపోయింది.

ఉన్నపళాన బైటకు పరుగుదీశాను కారణం ఏమై వుంటుందోననుకుంటూ.. అప్పటికే అమ్మ, మనీష్ బైటకు వెళ్ళారు ఆడే ఆటను ఎక్కడివక్కడే వదిలేసి.

మా ఇంటి ఎదురుగా వున్న పాల ఉత్పత్తి కేంద్రానికి సంబంధించిన గడ్డివాముల దగ్గర నుండి ఆకాశాన్నంటుతాయన్నట్లుగా మంటలు గాల్లోకి ఎగిసిపడ్తున్నాయి. చుట్టుపక్కల నిర్మాణంలో వున్న ఇళ్ళ దగ్గర పనిచేసే కూలీలు.. చిన్న చిన్న బిందెలతో నీళ్ళు తెచ్చి తమ శాయశక్తులా ఆ మంటలనార్పడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు.

నేను వెంటనే ఫైర్ స్టేషనుకి, పోలీసు స్టేషనుకి ఫోన్లు చేసి పరిస్థితిని వివరించి దయచేసి వెంటనే రమ్మని రిక్వెస్టు చేశాను.

ఫైర్‌స్టేషను స్టాఫ్, పోలీసులు వచ్చేలోపల నేను కూడా బిందెలతో నీళ్ళు తెచ్చి మంటలనార్పితే బాగుంటుందని అనిపించడంతో ఇంటివైపుగా నడవబోయాను. ఇంతలో..

"కన్నా" అంటూ అమ్మగొంతు గట్టిగా వినిపించేసరికి..ఆమెకేమైందోననుకుంటూ కంగారుగా అమ్మ వున్న దిశగా కదిలాను.

"రాఘవా! వెంటనే నువ్వా నిప్పంటుకున్న గడ్డివామును వదిలేసి ఆ పక్కనే మంచిగా వున్న గడ్డిని తీసుకొని దూరంగా వెయ్యండి. ఆ కూలీల సహాయం కూడా తీసుకో!"

"బిందెలతో నీళ్ళు పొయ్యడం మాని వెంటనే నేను చెప్పినవిధంగా చెయ్యండి" అంటూ ఆజ్ఞాపిస్తున్న అమ్మ గొంతు కంచుగంటలా మోగింది.

అప్పటివరకూ నాకా ఆలోచన రానందుకు నన్ను నేను తిట్టుకుంటూ వింటినుండి వదిలిన బాణంలా ఆ ప్రమాదం వైపుగా దూసుకెళ్ళాను.

అప్పటికే మంటలు మొదటి గడ్డివాము మీదుగా వెయ్యి నాలుకలు చాస్తూ రెండో గడ్డివాముని కూడా కబళించసాగాయి.

ఇకప్పుడు అమ్మే ప్రత్యక్షంగా రంగంలోకి దిగింది. కాళ్ళకు చెప్పులైనా లేకుండానే..చుట్టు పక్కల నిల్చోని..తలపడిపోతున్న గడ్డివామును చూస్తున్న వార్ని..తలొక చెయ్యి వెయ్యమని కోరుతూ మూడో గడ్డివాములోని గడ్డిని తీసికెళ్ళి దూరంగా తీసికెళ్ళి కుప్పగా పొయ్యసాగింది.

అరవై ఏళ్ళు పైబడిన ముసలావిడే..ఒక అనుభవం వున్న మిలటరీ కమాండర్‌లా అంత చురుగ్గా వేగంగా పనిచేస్తూండేసరికి...చుట్టుపక్కల ఆ సీన్‌ను సినిమాలా చూస్తూండిపోయిన జనంలో ఒక్కసారిగా కదలిక వచ్చింది.

ప్రభంజనంలా కదిలారు. కొద్దిసేపటిలోనే యుద్ధ ప్రాతిపదికన ప్రస్తుతం మంటలు కబళించిన గడ్డివాముల నుండి దూరంగా తరలిపోయాయి. మిగతా మూడు గడ్డివాములు.

అప్పటివరకూ అరుపులతో మారుమ్రోగిపోయిన ఆ ప్రాంతంలో అలజడి కాస్త సద్దుమణిగింది పరిస్థితి ఒక కొలిక్కిరావటంతో.

సినిమా క్లైమాక్స్‌లో పోలీసులు రంగప్రవేశం చేసేటట్లుగా..గంటలు గణగణ మోగించుకుంటూ ఫైరింజన్లు రెండు వచ్చాయి.

"ఆ ముసలావిడ ఎవరోగాని దేవతలా వచ్చి..ఈ జనంలో ఒక ఊపు తీసుకొచ్చి..మిగిలిన గడ్డివాములనైనా ఆ మంటల పాలవ్వకుండా కాపాడింది. ఈ చిన్న చిన్న బిందెలతో నీళ్ళు పోస్తూ ఆ మంటలనార్పాలనుకునే లోపలే మిగతావి అంటుకున్నాయంటే లక్ష రూపాయలు బుగ్గిపాలయ్యేవి"

"ఆ మూగజీవాల నోటికూడు బుగ్గిపాలయ్యేది" అంటూ అక్కడున్న జనం ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా అమ్మను మెచ్చుకోసాగారు.

ఇంతలో 'పాల ఉత్పత్తి కేంద్రం' ఓనరు సునీతగారు అమ్మ దగ్గరకు వచ్చి రెండు చేతులూ ఎత్తి దండం పెట్టింది కృతజ్ఞతాపూర్వకంగా.

ప్రతిగా చిన్నగా నవ్వి- మనీష్‌ని తీసుకొని ఇంటికి వచ్చేసింది అమ్మ. ఆ రోజు రాత్రి..ఎర్రటి ఎండలో చెప్పులు లేకుండా పనిచేయడం వలన బొబ్బలెక్కిన కాళ్ళకు ఆయింట్‌మెంట్ రాసుకుంటున్న అమ్మతో...

"ఎందుకమ్మా! ఈ వయసులో అంత ఎండలో ఈ సాహసం" చిన్నగా అరవబోయాను ప్రేమగానే.

"చూడు కన్నా! మనమందరం ఈ సమాజంలో బతుకుతున్నాం. కాబట్టి ఆపదలో వున్నవారికి సహాయం చెయ్యడం సాటిమనిషిగా మన కర్తవ్యం. మనలోని స్వార్థాన్ని కాస్త తగ్గించుకోవాలి. నా కాళ్ళకి బొబ్బలెక్కాయని నువ్వు బాధపడ్తున్నావు. కానీ కృతజ్ఞతలు చెప్తున్నప్పుడు ఆ స్త్రీ కళ్ళలో కనిపించిన ఆనందం..నా కాళ్ళ బాధని తగ్గించేసిందిరా" అంటున్న అమ్మ మోములో తోటివారికి సహాయ పడగా లభించిన తృప్తి..దానివల్ల లభించిన సంతోషం ప్రస్ఫుటంగా కనిపించాయి నాకు.

**-పల్లి ఉమాప్రసాద్ (అమీన్‌పూర్)**